క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గోరంట్ల (సోమందేపల్లి): గోరంట్ల మండలంలోని మలసముద్రం, కోరేవాండ్లపల్లి, పూలచెట్లపల్లి గ్రామంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హాజరవుతారన్నారు.

నేడు చింత ఫలసాయం వేలం

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి పంచాయతీలోని ఆర్‌అండ్ బీ, రోడ్డులకు ఇరువైపుల ఉన్న చింత చెట్లకు శుక్రవారం ఉదయం 11 గంటలకు గ్రామ సచివాలయంలో వేలంపాట నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ రంగనాథ్, కార్యదర్శి మల్లికార్జున తెలిపారు. ఆసక్తి గల వారు రూ.2 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లి గ్రామ పంచాయతీలోని పాపిరెడ్డిపల్లికి చెందిన అనితమ్మ అనారోగ్యంతో ఇటీవల చనిపోయారు. ఇందులో భాగంగానే వైఎస్సార్ బీమా ద్వారా తక్షణ సాయంగా రూ.10 వేలను గురువారం పంచాయతీ వైస్ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


జ్యోష్నారెడ్డి


పావని

లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రామాంజనేయులు తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వి.పావని, 8వ తరగతి చదువుతున్న కే.జోషా్నరెడ్డి జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారన్నారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల ఫుట్‌బాల్ పోటీలకు వారు ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 20 నుంచి 22 వరకు జరిగే పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. పులమతి విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో సర్పంచ్ అశ్వర్థనారాయణ, ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్‌రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ మంజునాథ్ విద్యార్థినులను అభినందించారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ


రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: పట్టణంలోని 17, 16, 18, 19, 23, 22, 20, 15 వార్డులలో సీసీ రోడ్లు, మురుగు కాల్వల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెంకటరమణప్ప గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.13 కోట్లతో పట్టణంలోని 23 వార్డులలో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణపు పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో వార్డుకు రూ.20 లక్షల నిధులను కేటాయించామన్నారు. శుక్రవారం మరో 8 వార్డుల్లో అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహిస్తామన్నారు. మున్సిపల్ అధ్యక్షురాలు ధనలక్ష్మి, ఉపాధ్యక్షురాలు శశికళ తదితరులు పాల్గొన్నారు.

మెనూ తప్పక పాటించాలి


మోడల్ స్కూల్‌లో హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

అమరాపురం: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలతో పాటు మోడల్ పాఠశాలలో ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన మెనూను తప్పక వంట ఏజెన్సీలు పాటించాలని ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. గురువారం మండలంలోని హాలుకూరు సమీపంలో ఉన్న మోడల్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు.

కేఏటీ ఒలంపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: జాతీయ స్థాయిలో నిర్వహించే నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్ (కేఏటీ) రెండో దశ పరీక్షల్లో పట్టణంలోని శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. స్థానిక పాఠశాలలో ప్రతిభ కనబరిచిన మహమ్మద్ ముజామిల్, మణిత్ సాయిరెడ్డి, తరుణ్ కృష్ణలను గురువారం అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రకాష్‌రెడ్డి, ఏఓ ప్రభాకర్‌రెడ్డి, డీన్ నాగరాజు, సీ-బ్యాచ్ ఇన్‌చార్జ్ నాగరాజు పాల్గొన్నారు.

బీడు భూములకు జలకళ

- మడకశిర నియోజకవర్గంలో వైఎస్సార్ జలకళ పథకం విజయవంతం
- 72లో 69 బోర్లలో సమృద్ధిగా నీళ్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న సన్న, చిన్నకారు రైతులు


గుడిబండ మండలం చిగతుర్పిలో వైఎస్సార్ జలకళ బోరులో సమృద్ధిగా పడిన నీళ్లు

మడకశిర: జిల్లాలోనే మడకశిర నియోజకవర్గం పూర్తిగా వెనుకబడిన ప్రాంతం. ఈ నియోజకవర్గంలో దాదాపు 98 శాతం మంది రైతులే. పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ జలకళ పథకం వరంగా మారింది. ప్రధానంగా జలకళ పథకం సన్న, చిన్నకారు రైతుల కళ్ళల్లో ఆనందాన్ని నింపుతోంది.

69 బోర్లలో నీళ్లు..

జలకళ పథకం కింద మడకశిర నియోజకవర్గంలో ఇప్పటి దాకా 72 బోర్లను డ్రిల్ చేశారు. ఇందులో 69 బోర్లలో నీళ్లు సమృద్ధిగా పడ్డాయి. వైఎస్సార్ జలకళ పథకం బోర్ల మంజూరుకు అగళి మండలంలో 113, అమరాపురంలో 596, గుడిబండలో 162, మడకశిరలో 315, రొళ్లలో 2 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 5 మండలాల నుంచి 1273 దరఖాస్తులు రాగా... అందులో 159 బోర్లు మంజూరయ్యాయి. మంజూరైన బోర్లలో 72 బోర్లను డ్రిల్ చేశారు. మిగిలిన బోర్లను దశల వారీగా డ్రిల్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో భారీ వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండడడంతో భూగర్భజల మట్టం బాగా పెరిగింది. దీంతో జలకళ పథకం కింద వేస్తున్న బోర్లన్నీ దాదాపు విజయవంతం అవుతున్నాయి.

మడకశిరలో 'జలకళ ' ఇలా..	
బోర్ల కోసం వచ్చిన దరఖాస్తులు	1273
మంజూరైన బోర్లు	159
డ్రిల్ చేసిన బోర్లు	72
నీళ్లు పడిన బోర్లు	69

జగనన్నకు రుణపడి ఉంటా



నాకు 4.80 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే బోరు వేయించుకు నేస్తోమత లేక వ్యవసాయ భూమంతా బీడుగా ఉండేది. ఇలాంటి పరిస్థితిలో తనకు ప్రభుత్వం వైఎస్సార్ జలకళ పథకం కింద బోరు వేయించింది. నీళ్లు సమృద్ధిగా పడ్డాయి. ముఖ్యమంత్రి జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటా. – ఈరమ్మ, మహిళా రైతు, కెంకర

మాలాంటోళ్లకు వరం



వైఎస్సార్ జల కళ పథకం మాలాంటి పేద రైతులకు వరం. ఈ పథకం కింద ప్రభుత్వం నా భూమిలో బోరు వేసి ఆదుకుంది. పైసా ఖర్చు లేకుండా అర్హతే ప్రామాణికంగా బోరు మంజూరు చేయడం ఎంతో ఆనందంగా ఉంది. సమృద్ధిగా నీళ్ల పడటంతో వ్యవసాయం చేసుకోవడానికి అవకాశం ఏర్పడింది. – హనుమంతరాయప్ప, అమరాపురం

దశల వారీగా అమలు



వైఎస్సార్ జలకళ పథకం కింద దశలవారీగా బోర్లు వేస్తున్నాం. అర్హతే ప్రామాణికంగా ఉచిత బోర్లు వేస్తున్నాం. మడకశిర క్లస్టర్ పరిధిలో ఉచిత బోర్లకు 1273 దరఖాస్తులు వచ్చాయి. ఈ పథకం నిరంతరం కొనసాగుతుంది. అర్హత ఉన్న ప్రతి రైతుకూ ఉచిత బోరు మంజూరు చేస్తాం. – జయసింహ, ఏపీడీ, మడకశిర

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం


అగళి: సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి


చిలమత్తూరు: మరువపల్లిలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఇక్బాల్



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు మారన్న. వీరిది అగళి మండలం ఇరిగేపల్లి గ్రామం. ప్రతి ఏడాది రైతు భరోసా కింద రూ.13,500 ఖాతాలో జమ అవుతుంది. అలాగే నెలనెలా రూ.2,750 చొప్పున పింఛన్ వస్తోంది. ఇలా ప్రతి ఏడాది వివిధ పథకాల మారన్న కుటుంబానికి రూ.75 వేల వరకు లబ్ధి చేకూరుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న నవరత్నాల వల్లనే తమకు ఈ లబ్ధి చేకూరుతోందని, ఎల్లప్పుడూ ముఖ్యమంత్రి జగన్‌కు అండగా నిలబడతామని మారన్న హర్షం వ్యక్తం చేశారు.

మడకశిర(అగళి): ప్రజల మద్దతు వైఎస్ జగన్‌కే ఉందని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన నవరత్నాలు పేదలకు వరమని పేర్కొన్నారు. గురువారం అగళి మండలం ఇరిగేపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల పెన్నిధి అని తెలిపారు. పేదల కోసం ప్రత్యేకంగా నవరత్నాలు అమలు చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను మంజూరు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు నవరత్నాలతో లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఒక్కో సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసిందని, ఈనిధులతో గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఇచ్చిన హామీలన్నీ జగనన్న ప్రభుత్వం దాదాపుగా నెరవేర్చిందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పే మాయ మాటలను నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మహేంద్ర, కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రప్ప, సచివాలయం కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ శివన్న, నాయకులు తిప్పేస్వామి, నటరాజు, సురేష్, శివలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: ప్రజా సంక్షేమమే సీఎం జగన్ మోహన్‌రెడ్డి అంతిమ ధ్యేయమని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని చాగలేరు పంచాయతీ మరువపల్లి, నంజిరెడ్డిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని గుర్తుచేశారు. ఎక్కడా పక్షపాతం చూపకుండా పేద ప్రజల కుటుంబాల్లో సంక్షేమ వెలుగులు నింపారని కొనియాడారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు పరిపాలన మరింత చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ ఏనాడైనా ఇలా గ్రామాలను తిరిగిన దాఖలాలున్నాయా అని ప్రశ్నించారు. నియోజకవర్గ ప్రజలను మోసం చేసి సినిమాలు, షికార్లంటూ తిరగడం దురదృష్టకరమన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎంత గింజుకున్నా ప్రజలు ఆయన్ను నమ్మరన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్, వైస్ ఎంపీపీ బయప్ప, మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ జయలలిత, నాయకులు జనార్దన్‌రెడ్డి, రాజారెడ్డి, శంకరప్ప, బాబేనాయక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు రెడ్డిశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు రెడ్డిశ్వర్‌రెడ్డి

హిందూపురం: వైఎస్సార్‌సీపీలోని ప్రతి ఒక్కరినీ సంఘటితం చేసి పార్టీని మరింత బలోపేతం చేసి 2024లో హిందూపురంలో వైఎస్సార్‌సీపీ గెలుపుకు కృషి చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు రెడ్డిశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి కుటుంబంలోనూ కొన్ని సమస్యలు వస్తుంటాయని, అయితే అవసరమైనప్పుడు అందరూ ఏకమవుతుంటారన్నారు. అలాగే పార్టీలో కొన్ని ఇబ్బందులు ఉండొచ్చని, అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలే అందరికీ శిరోధారమన్నారు. పార్టీ కోసం అందరూ కలిసి పనిచేయాల్సిందేనని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలందరినీ ఏకతాటిపై తేవాలన్న అధిష్టానం ఆదేశాల మేరకు తాను పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గస్థాయి నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులందరినీ కలిసి అందరి సలహాలు, సహకారంతో ముందుకు వెళ్తామన్నారు. ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్‌తో పాటు ఇతర నాయకులందరితో కలిసి నడుస్తామని చెప్పారు. తమకు ఎలాంటి వర్గ విభేదాలు లేవన్నారు. రాబోవు రెండు నెలల్లో పార్టీలో అసంతృప్తి లేకుండా అందరూ సంతృప్తిగా పనిచేసే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్ శివ, నాయకులు నాగభూషణంరెడ్డి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి సుబ్రహ్మణ్యుడి బ్రహ్మోత్సవాలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 25 నుంచి 28 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 25న ధ్వజారోహణ, అంకురార్పణ, 26న కల్యాణోత్సవం, , 27న బ్రహ్మరథోత్సవం, 28న వసంతోత్సవం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ


విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ చేస్తున్న ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్

హిందూపురం: 'తెలుగుభాష జాతి కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు. అలాంటి మహనీయుడి మార్గం అందరికీ అనుసరణీయం' అని ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ అన్నారు. బలిజ సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ ప్రతిష్టకు భూమి పూజలు చేసి పనులు ప్రారంభించారు. బలిజ సంఘం నాయకులు విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేసేందుకు యత్నించగా అధికారులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. అయితే నవీన్‌నిశ్చల్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించి పనులు ప్రారంభింపజేశారు. కార్యక్రమంలో బలిజ సంఘ నాయకులు కౌన్సిలర్ రామచంద్రా, గోపాల్, రమేష్, వెంకటరాముడు, ఉమేష్, ఆది, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి


ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి

హిందూపురం: రాష్ట్రంలోనే ఏ ముఖ్యమంత్రి ఇంత వరకు చేయలేనని ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందిస్తున్న సంక్షేమ సారథి సీఎం జగన్‌ను ప్రజలందరూ ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం పార్టీ నాయకులతో కలిసి పట్టణంలోని 13వ వార్డు సడ్లపల్లిలో 'ప్రజలతో మమేకం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరు, వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనను వివరించారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండ పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శివ, ఆసీఫ్‌వుల్లా, నాయకులు తిమ్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామాంజి, గోపాల్‌రెడ్డి, సుధాకర్, నారాయణరెడ్డి, తిమ్మన్న రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

యోగివేమన ఆశయ సాధనకు కృషి


హిందూపురం: యోగి వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సాక్షిబృందం: విశ్వకవి యోగివేమన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. హిందూపురం, మడకశిర, పెనుకొండ మండలాల్లో యోగి వేమన జయంతిని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగానే యోగి వేమన చిత్రపటాలతో ర్యాలీలు నిర్వహించారు. కేక్ చేయడంతో పాటు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలను చేశారు.

మంత్రి రోజాని కలసిన ఎమ్మెల్యే



పెనుకొండ: రాష్ట్ర పర్యాటకశాఖామంత్రి రోజాను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శంకరనారాయణ గురువారం కదిరిలో కలిశారు. వేమన ఉత్సవాల్లో పాల్గొనడానికి వెళుతున్న మంత్రిని కదిరి ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలసి పుష్పగుచ్ఛం అందించారు.

సంక్షిప్త సమాచారం

రహదారిని పునరుద్ధరించండి

లేపాక్షి: మండలంలోని శిరివరం నుంచి తిరుమలదేవరపల్లి, పొలాలకు వెళ్లే రహదారి (సర్వేనంబర్ 76లో)ని బెంగళూరు ప్రాంతానికి చెందిన భూ యజమాని ఆక్రమించి కంచే వేశారని దీంతో చాలా మంది పొలాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు రైతులు తహసీల్దార్ బాబుకు గురువారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకొని రైతులు పొలాల్లోకి వెళ్లడానికి రహదారి సౌకర్యం కల్పించాలని తెలిపారు.

సోషల్ ఆడిట్ పారదర్శకంగా చేయండి

పెనుకొండ: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి సోషల్ ఆడిట్‌పై సర్పంచ్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆనిమేటర్లు ఇతర సిబ్బందితో ఎంపీడీఓ శివశంకరప్ప సమావేశం నిర్వహించారు. రూ. 32 కోట్లకు సంబంధించిన పనులపై సామాజిక తనిఖీని పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర రీసోర్స్‌పర్సన్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 12 రోజుల్లో ఆడిట్ పూర్తి చేయాలన్నారు.

అతివేగం ప్రమాదకరం

హిందూపురం: అతివేగం ప్రమాదకరమని వాహనాల్లో ప్రయాణించే సమయంలో రోడ్డు నిబంధనలు పాటిస్తే సురక్షితంగా ఉంటామని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రమణ అన్నారు. గురువారం ఎల్‌ఆర్‌జీ జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా రోడ్డు ప్రయాణాలు జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలిచ్చారు.

పెనుకొండ: నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ. రమేష్‌బాబు హెచ్చరించారు. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్లో గురువారం ఆయన ఆటో డ్రైవర్లు, కార్లు, జీపుల డ్రైవర్‌లకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

పెనుకొండ రూరల్: కియా పరిధిలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న 32 మంది వాహనదారులకు ఎస్ఐ వెంకటరమణ జరిమానా విధించారు.

నకిలీ ఎరువుల స్వాధీనం

పావగడ: పట్టణంలోని చళ్లకెర క్రాస్ లో నిర్వహిస్తున్న శ్రీరామ ఆగ్రో ట్రేడర్స్ దుకాణంపై వ్యవసాయశాఖ జిల్లా తనిఖీ బృందం గురువారం దాడులు చేసింది. అక్రమంగా విక్రయిస్తున్న నకిలీ, నమోదు కాని ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా వ్యవసాయశాఖ జేడీ పుట్ట రంగప్ప మాట్లాడుతూ అధిక మొత్తంలో నకిలీ ఎరువులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిబంధనలు పాటించకుండా అమ్ముతున్న క్రిమి సంహారక మందులు కూడా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. విక్రయదారులపై కేసు నమోదు చేస్తామన్నారు.

సమయ పాలన పాటించాలి

అమరాపురం: గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు తప్పక సమయ పాలన పాటించాలని ఎంపీడీఓ మునిస్వామి పేర్కొన్నారు. గురువారం సాయంకాలం మండలంలోని ఆలదపల్లి, హాలుకూరు 2 సచివాలయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు హాజరు పట్టికను పరిశీలించి పలు సూచనలు, సలహాలిచ్చారు.

సచివాలయం తనిఖీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని గోవిందాపురం గ్రామ సచివాలయాన్ని గురువారం ఎంపీడీఓ సోనీబాయి తనిఖీ చేసిన రికార్డులను పరిశీలించారు. ఆధార్ సేవలు, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలపై సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శైలజ, కార్యదర్శి ఈరలింగప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తే చర్యలు

రొద్దం: మండల కేంద్రంలోని 721-1లో ఉన్న ఖాళీ స్థలం ప్రభుత్వ పంచాయతీకి సంబంధించినదని ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ చెప్పారు. ఎవరైనా అందులో నిర్మాణాలు చేపడితే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటే ఆ స్థలంలో నిర్మాణం చేపడుతున్నట్లు గురువారం తమ దృష్టికి వచ్చిందన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

చెక్‌డ్యాం తనిఖీ

రొద్దం: మండల పరిధిలోని ఎం.కొత్తపల్లిలో టీడీపీ నాయకుడు నాగరాజు తన పొలంలో ఉపాధి పనుల ద్వారా చెక్‌డ్యాం నిర్మిస్తున్నారని పనులను అడ్డుకున్నారు. అధికారులకు ఫిర్యాదు రావడంతో గురువారం రెవెన్యూ అధికారులు చెక్‌డ్యాం నిర్మాణ పనులను పరిశీలించారు. టీడీపీ నాయకుడు చెప్పినట్లు ఆయన స్వంత పొలంలో లేదని.. అది ప్రభుత్వ స్థలమని తేల్చారు. తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, తదితరులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయండి

రొళ్ల: 'జగనన్న శాశ్వత సమగ్ర భూ హక్కు పథకం' కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయిలో సర్వే ప్రక్రియను రెవెన్యూ సిబ్బంది వేగవంతం చేయాలని తహసీల్దార్ హసీనాసుల్తానా పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా ఏడు రెవెన్యూ గ్రామాల పరిధిలోని వివిధ గ్రామాల్లో వీఆర్వోలు, సర్వేయర్లు, వీఆర్‌ఏలు చేపట్టిన సర్వేపై రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు.

సజావుగా వాహనాల వేలం

గుడిబండ: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం వివిధ కేసుల్లో పట్టుబడిన 17 ద్విచక్ర వాహనాలను సెబ్ సీఐ భార్గవ్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం వేశారు. మొత్తం 17 ద్విచక్ర వాహనాలను వేలం వేయడం ద్వారా ప్రభుత్వానికి రూ.5,02,090 ఆదాయం వచ్చిందన్నారు. ఎస్ఐ మునిప్రతాప్, పోలీసు, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సేవలు ప్రారంభం

అమరాపురం: మండలంలోని గ్రామ సచివాలయాల్లో కొత్తగా ఆధార్ కార్డు చేయించుకోవచ్చని ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. గురువారం మండలంలోని వలస, వి.అగ్రహారం సచివాలయంలతో పాటు హేమావతి -1 సచివాలయంలో ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా కొత్తగా చిన్న పిల్లలకు ఆధార్ నమోదును సర్పంచ్ నాగవేణి, తిప్పేస్వామి ప్రారంభించారు. అలాగే 20న మండలంలోని తమ్మడేపల్లి 1, 2 సచివాలయంతో పాటు హేమావతి -2 సచివాలయం, 21న అమరాపురం 1, 2, నిద్రగట్ట, 23న హాలుకూరు 1, 2, ఆలదపల్లి, 24న బసవనపల్లి, కె.శివరం, మద్దనకుంట గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

కన్నడ సాహిత్య సమ్మేళనానికి సహకరించండి

పావగడ: ఫిబ్రవరిలో నిర్వహించనున్న 7వ తాలూకా కన్నడ సాహిత్య సమ్మేళనానికి తాలూకా లోని అన్ని సంఘ సంస్థలు సహకరించాలని స్థానిక కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి కోరారు. స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రముఖుల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 111 పాఠశాలల్లో కన్నడ ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఇందులో పాల్గొనే ప్రముఖ వ్యక్తులను సన్మానిస్తున్నట్లు చెప్పారు.

నృసింహుని దర్శనం కోసం పాదయాత్ర


పాదయాత్రగా బయలుదేరి వెళ్తున్న భక్తులు

పరిగి: ఖాద్రీ నరసింహస్వామి దర్శనం కోసం పరిగి 90 ఇండ్ల కాలనీ వాసులు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. మండల వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి శివశంకర్ ఆధ్వర్యంలో కదిరి లక్ష్మీనరసింహస్వామికి మొక్కుబడిలో భాగంగా గురువారం పరిగి నుంచి కదిరి వరకూ 35 మంది భక్తబృందం సభ్యులు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. యాత్రను సర్పంచ్ లక్ష్మీదేవి ప్రారంభించారు.